## క్లుప్తంగా

### రాయికల్ బల్దియాలో రూ.15 కోట్లతో అభివృద్ధి



కమిషనర్, ఏఈతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: పట్టణంలో రూ.15 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులపై శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్, ఏఈ లక్ష్మి తో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15 కోట్ల నిధులతో రాయికల్ పట్టణంలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, పార్కులు, శ్మశానవాటిక, కమ్యూనిటీ హాల్స్ తదితర వాటి విషయంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

### నృసింహుడిని దర్శించుకున్న అడిషనల్ సీఈవో



స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేత

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం సెర్ప్ అడిషనల్ సీఈవో ( సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ ప్రాపర్టీ ) కాత్యాయని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం పక్షాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

### పోషకాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

గొల్లపల్లి: పోషకాహారంతోనే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని ఇబ్రహీంనగర్ సెక్టార్ భీంరాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రెవెళ్ల రాజ సులోచన, ఏఎన్‌ఎం రాజమల్లేశ్వరి, సహనబి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

### ఫేస్ రికగ్నైజేషన్ తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీడీపీవో అరవింద

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకుల పంపిణీకి లబ్ధిదారుల హాజరు తప్పనిసరని మల్యాల ఏసీడీపీవో అరవింద అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని చిన్నారుల హాజరు రిజిష్టర్, లబ్ధిదారుల వివరాలు, టీహెచ్‌ఆర్ పంపిణీ చేస్తున్న తీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ స్కూల్ విద్యను బలోపేతం చేస్తూ చిన్నారులచే రోజువారి కృత్యాలు చేయించాలని టీచర్లకు సూచిస్తూ లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

### పురస్కార గ్రహీతలకు సత్కారం



రాజును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

జగిత్యాల: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన నీలి వాసవి, పర్లపల్లి రాజును కళాశాల బృందం శనివారం ఘనంగా సత్కరించారు. ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ ఇద్దరు అధ్యాపకులకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించడం జగిత్యాల జిల్లాకే గర్వకారణమన్నారు. ప్రతీ ఒక్కరు పురస్కారం అందుకోవాలని ఆకాంక్షించారు.

## బై బై గణేశా..



కోరుట్లలో ప్రథమ బహుమతి పొందిన గణపతి



ధర్మపురిలో మహిళల కోలాటం



కోరుట్లలో నిమజ్జనం చేస్తున్న మహిళలు, భక్తులు

జగిత్యాలరూరల్/మల్లాపూర్/కోరుట్ల/మెట్‌పల్లి/మల్యాల/కథలాపూర్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని గ్రామాల్లోని పలు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం సాయంత్రం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. మహిళలు కోలాటాలతో సంబరాలు నిర్వహించారు.

మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్యాల మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో రెండోరోజు వినాయక నిమజ్జనాలు నిర్వహించారు. కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో శనివారం రాత్రి వినాయకుడి నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో యువకులు,చిన్నారులు నృత్యాలు, భజనలు చేస్తూ సందడి చేశారు.



మల్లాపూర్‌లో శోభాయాత్రలో మహిళలు



వట్టివాగు వద్ద వినాయక విగ్రహంతో న్యాయవాదులు





కోరుట్ల: పట్టణంలోని దేశాయి బీడీ గోడౌన్ జాతీయ రహదారి నుంచి రాంనగర్ వెళ్లే రోడ్డు వర్షాలకు చిత్తడిగా మారి, ఈ దారి గుండా వెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. బురద రోడ్డుపు బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల సెల్ నంబర్: 9849905880

### వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

# కూలిపోతున్న స్పందించరా?

- వృథా పోతున్న కుంట నీరు
- భూగర్భ జలాల పెంపునకు దోహదం
- 27 ఏళ్ల క్రితం అటవీప్రాంతంలో ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కూలిపోయిన కుంట మత్తడి



వర్షాలకు బతుకమ్మకుంటలో చేరిన నీరు

సారంగాపూర్: భూగర్భ జలాల పెంపుతో పాటు, వన్యప్రాణులకు నీరందించే లక్ష్యంతో 27 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బతుకమ్మ కుంట మత్తడి ఇటీవలి భారీ వర్షాలకు 80 శాతం వరకు కొట్టుకుపోగా, ప్రస్తుతం ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇటీవలి భారీ వర్షాలకు మత్తడి ఒక పక్కన తెగిపోయి కుంటలోని నీరంతా వృథాగా పోతోంది.

**బతుకమ్మ కుంట..**

సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న బతుకమ్మ కుంట పూర్తిగా అటవీప్రాంతంలో ఏర్పాటు చేశారు. గతంలో హిమ్మత్‌రావు కుంటగా పిలిచే ఈ కుంటలో బతుకమ్మలు నిమజ్జనం చేయడంతో బతుకమ్మ కుంటగా మార్చారు. దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కుంట సారంగాపూర్-జగిత్యాల మధ్య ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని ఆనుకుని ఉంది. కుంట చుట్టూ ఎత్తైన కొండలు, గుట్టలు ఉండడంతో కుంటలో వేసవిలోనూ నీరు పుష్కలంగా ఉంటుంది.

**పచ్చని అడవుల మధ్య కుంట..**

27 ఏళ్ల క్రితం వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో అటవీ శాఖ ఈ కుంటను నిర్మాణం చేసింది. కుంటకు ఒక వైపున ఎగువ నుంచి వచ్చే వర్షపునీరు కుంట నిండిపోతో దిగువకు వెళ్లడానికి మత్తడి నిర్మించారు. రెండేళ్ల నుంచి మత్తడి కింద భాగంలో బుంగ ఏర్పడింది. ఈ బుంగ మూయడానికి అటవీశాఖ ఏలాంటి చర్యలు చేపట్టకపోవడంతో మత్తడి కింద భాగం పూర్తిగా కూలిపోయి దిగువకు నీరు వృథాగా పోతుంది. ఇటీవలి భారీ వర్షాలకు మత్తడి కొంత భాగం తెగిపోయి నీరంతా బయటకు వృథాగా పోతుంది.

**రూ.10 లక్షలు వెచ్చిస్తే పూర్తి మరమ్మతులు**

అటవీశాఖలో నిధుల కొరతతో రెండేళ్ల క్రితం చేపట్టాల్సిన మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏ క్షణానైనా మత్తడి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే మొన్నటి వరదలకు మత్తడి పక్క నుంచి పెద్ద మొత్తంలో నీరు బయటకు వస్తుంది. వచ్చిన నీరు వచ్చినట్లు వాగుల ద్వారా గోదావరిలోకి చేరుతుంది. ప్రస్తుతం అటవీశాఖ రూ. 10 లక్షలు వెచ్చిస్తే కుంటకు మరమ్మతులు చేయవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

**కుంట ఏర్పాటు ద్వారా చాల లాభాలు:**

- వన్యప్రాణులకు నీరు తాగడానికి ఈ కుంట అవసరం.
- కుంట కింద ఉన్న 500 ఎకరాల వ్యవసాయ భూముల్లోని బావుల్లో భూగర్భ జలాల పెరుగుతాయి.
- పూర్తిగా అటవీప్రాంతంలో ఉండడం, పచ్చదనం, రోడ్డు వెంట ఉండడంతో రోజు వందలాది మంది ఈ కుంట వద్ద ఫోటో షూట్స్, చిన్న సినిమాలు, వీడియో షూట్స్ తీసుకుంటున్నారు.

### వన్యప్రాణులకు తాగునీరు



బతుకమ్మ కుంట మత్తడి కూలిపోయి నీరు దిగువకు వృథాగా పోతుంది. దీనితో వన్యప్రాణులకు వేసవిలో తాగునీరు కూడ అందే పరిస్థితి ఉండదు. అటవీశాఖ అవసరమైన చర్యలు తీసుకుని కుంటకు మరమ్మతులు చేయిస్తే భూమిలో నీటి నిల్వలు పెరుగుతాయి.

– కొత్తపల్లి అరుణ్, సారంగాపూర్

### పర్యాటక ప్రాంతంగా పేరొందింది



సారంగాపూర్ బతుకమ్మ కుంట అటవీప్రాంతంలో రోజు వందలాది వీడియో షూటింగ్స్ జరుగుతున్నాయి. పచ్చని అటవీప్రాంతం కావడంతో దూరప్రాంతాల నుంచి ఇక్కడికి పిక్నిక్‌లకు వస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వంగ విజయ్, కోనాపూర్

### నిధులు మంజూరు కాగానే మరమ్మతు



మత్తడి కూలిపోయి, నీరు వృథాగా పోతుంది. మొన్నటి భారీ వర్షాలు, వరదలకు మత్తడి కూలిపోయిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే కొత్త మత్తడి నిర్మాణం చేపడతాం.

– గోపాల్, బీట్ అధికారి

## విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

సారంగాపూర్: ఉత్తమ ఫలితాల సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తయారు చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయునులతో మాట్లాడుతూ అన్ని తరగతుల్లో విద్యార్థులను ఉత్తమ ప్రతిభ కనబరిచేలా చూడాలన్నారు. అనంతరం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోజు వారి పీహెచ్‌సీకి వచ్చే రోగుల రిజిష్టర్లలో వివరాలను, ల్యాబ్, పరిసరాలను పరిశీలించి రోగులకు సరైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ వాహిదొద్దీన్, ఎంపీడీవో గంగాధర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి వీణ, మండల వైద్యాధికారి డాక్టర్ రాధారెడ్డి, ఆయా శాఖల సిబ్బంది ఉన్నారు.

## వివాదాస్పద అటవీ ప్రాంతాల పరిశీలన



భూమి పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

మేడిపల్లి: భీమారం మండలంలోని దేశాయిపేట, రాజలింగంపేట, భీమారం గ్రామాల పరిధిలోని సీతారామ ప్రాజెక్టుకు అప్పగించిన అటవీ ప్రాంతాలను సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం శనివారం పరిశీలించారు. ప్రాజెక్టుకు అప్పగించిన భూముల్లో కొంత భాగం రైతులకు చెందిన సర్వేనెంబర్లు ఉన్నాయని చాలా రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ నిషేధిత లిస్టు నుంచి తీయడంలేదని స్థానిక రైతులు, నాయకులు తెలిపారు. వెంటనే సమస్యపై అధికారులు చర్యలు తీసుకోవాలని చెన్న విశ్వనాదం కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునుగురు హనుమంతు, తాజా మాజీ సర్పంచ్ నాంచారి స్వప్న రాజేందర్, సీపీఐ భీమారం మండల కార్యదర్శి కొండా రాజయ్య, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

### నానో యూరియాపై అవగాహన

కొడిమ్యాల: మండలంలోని గౌరపూర్‌లో నానో యూరియా వాడకం గురించి రైతులకు మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ప్యాక్స్ చైర్మన్ బండ రవీందర్ రెడ్డి అవగాహన కల్పించారు. పొలంలో డ్రోన్ సహాయంతోనే 18 ఎకరాలకు యూరియా స్ప్రే చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజేష్, రైతులు పాల్గొన్నారు.

### దరఖాస్తులు ఆహ్వానం

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఓసీ కేటగిరీల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతి తెలిపారు. 5,6,7 తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తులు ఈ నెల 10 వరకు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు పాఠశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. డ్రా పద్ధతిలో సీట్ల ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

### 10న శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10న క్యాంపస్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు కరస్పాండెంట్ పోతని ప్రవీణ్, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ శనివారం పేర్కొన్నారు. ఏదేని డిగ్రీలో 55 శాతం కలిగి ఉండి 26 ఏళ్ల వయస్సు అర్హత ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం అచ్చ విజయభాస్కర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌ను తపస్ నాయకులు గుర్రాల ప్రేమ్‌కుమార్, రమేశ్, మనోజ్‌కుమార్ శనివారం సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అవార్డు అందుకోనున్నారు.

### కత్తితో దాడిచేసిన ముగ్గురి అరెస్టు

సారంగాపూర్: మండల కేంద్రంలో ఓ వ్యక్తిని కత్తితో పొడిచి, మరో ఇద్దరిపై దాడి చేసిన ముగ్గురు యువకులపై శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గీత తెలిపారు. సారంగాపూర్‌కు చెందిన రాజు, రాజ్‌కుమార్, శేఖర్ పాత పగలు మనసులో పెట్టుకుని పోతారం గ్రామానికి చెందిన హరీశ్‌ను కత్తితో పొడిచి, అదే గ్రామానికి చెందిన సాయికృష్ణ, స్వామిని కొట్టి గాయపరచిన కేసులో రాజు, రాజ్‌కుమార్, శేఖర్‌లపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### కలిగోట- పోతారం తండా రోడ్డుకు నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలోని కలిగోట నుంచి పోతారం గ్రామశివారులోని లొంక రామన్న తండా వరకు బీటీ రోడ్డు కోసం రూ. 5.30 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామాల్లో ఓటరు జాబితా ప్రదర్శన





జగిత్యాల,కోరుట్ల ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటర్ జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్/కోరుట్ల రూరల్/పెగడపల్లి/కథలాపూర్/సారంగాపూర్/మల్లాపూర్/మల్యాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శనివారం అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితా పాటు, పోలింగ్ స్టేషన్ల వివరాలను నోటీసుబోర్డులపై ఎన్నికల ఓటర్ జాబితాలను ప్రచురించారు. ఈనెల 8వ తేదీలోపు అభ్యంతరాలు స్వీకరిస్తామని, అదే రోజు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి 10 వ తేదీన తుదిజాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### శ్రీభవాని సేవా సమితి అధ్యక్షుడిగా శ్రీగద్దె సుమన్



సుమన్

రాయికల్: పట్టణంలోని శ్రీ భవాని సేవా సమితి కార్యవర్గంను శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీగద్దె సుమన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా రాగళ్ల జనార్దన్, ఉపాధ్యక్షులుగా కోయల్కార్ వినోద్, తొగిటి రవితేజ, ప్రధాన కార్యదర్శిగా మోర శశికాంత్, కోశాధికారిగా నవీన్‌కుమార్, శివప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా శ్రీగద్దె శ్రావణ్‌కుమార్, దువ్వాక కృష్ణ, ముఖ్య సలహాదారులుగా కృష్ణ ఎన్నికయ్యారు.

### ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి



ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

మల్లాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేసి ముగ్గు పోశారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పరామర్శ

మేడిపల్లి: మండలంలోని రాగోజీపేట, వెంకట్రావుపేట గ్రామాల్లోని పలువురు బాధిత కుటుంబాలను తెలంగాణ కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి శనివారం పరామర్శించారు. వారితో పాటు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మడి రవి, మహిళ నాయకులు సుమలత, బందెల గంగాదర్, తదితరులున్నారు.

### ప్రమాదకరంగా మద్దుట్ల రాంసాగర్ రోడ్డు



రోడ్డుపైకి విస్తరించిన చెట్ల కొమ్మలు

మల్యాల: మండలంలోని మద్దుట్ల నుంచి రాంసాగర్‌కు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు విస్తరించడంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి, చెట్ల కొమ్మలు తొలగించి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.